నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్-నిర్మల్
5 | నిజామాబాద్ శనివారం 13 ఏప్రిల్ 2024 | ADILABAD NIRMAL

గమ్యం యాప్‌పై ప్రయాణికులకు అవగాహన

మాట్లాడుతున్న రీజినల్ మేనేజర్ సులేమాన్

ఆదిలాబాద్ రూరల్, ఏప్రిల్ 12 : ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు గమ్యం యాప్‌పై శుక్రవారం ఆర్టీసీ అధికారులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రీజినల్ మేనేజర్ సులేమాన్ మాట్లాడుతూ ఆర్టీసీ ప్రవేశపెట్టిన ప్రతి కార్యక్రమాన్నీ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రయాణికులకు ఎప్పటికప్పుడు చేరవేస్తూ ఉంటుందన్నారు. అందులో భాగంగానే గమ్యం యాప్‌ను రూపొందించినట్లు తెలిపారు. యాప్ ద్వారా ఆయా రూట్‌లలో ఆర్టీసీ బస్సుల వివరాలు సులభంగా తెలుసుకోవచ్చని వివరించారు. ఈ కార్యక్రమంలో రీజినల్ మేనేజర్లు ప్రణీత్, ప్రవీణ్‌కుమార్, డిపో మేనేజర్ కల్పన, ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

రూ. 5 లక్షలు పట్టివేత

సారంగాపూర్, ఏప్రిల్ 12 : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో సారంగాపూర్ మండల కేంద్రంలో ఎస్ఐ చంద్రమోహన్ ఆధ్వర్యంలో శుక్రవారం వాహనాలు తనిఖీ చేశారు. మలక్‌చించోలి గ్రామానికి చెందిన గోశకుల పోశెట్టి వద్ద రూ.3.50లక్షలు, దేవితండాకు చెందిన రాథోడ్ ప్రహ్లాద్ వద్ద రూ.1.50లక్షల నగదు పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ నగదుకు సంబంధించి సరైన పత్రాలు లేనందున సీజ్ చేసి నిర్మల్ కలెక్టరేట్‌లోని ప్రత్యేక అధికారికి అప్పగించినటుల చెప్పారు. ఎవరైనా రూ.50 వేల కంటే ఎక్కువ డబ్బులు తరలించినా, అక్రమంగా మద్యం సరఫరా చేసినా సీజ్ చేసి, కేసులు నమోదు చేస్తామని ఎస్ఐ హెచ్చరించారు.

ఘన్‌పూర్ చెక్‌పోస్ట్ వద్ద నగదు పట్టివేత

బోథ్, ఏప్రిల్ 12 : మండలంలోని ఘన్‌పూర్ అంతర్రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద శుక్రవారం సాయంత్రం నిర్వహించిన తనిఖీల్లో సరైన పత్రాలు లేకుండా తరలిస్తున్న నగదును పట్టుకున్నట్లు ఎస్ఐ రాము తెలిపారు. ఒకరి వద్ద నుంచి రూ.1.16 లక్షలు, మరొకరి వద్ద రూ.1,05260 నగదును స్వాధీనం చేసుకొని ఎఫ్ఎస్టీ బృందం సభ్యులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆత్రం సక్కును గెలిపించాలని నినాదాలు చేస్తున్న మాజీ మంత్రి రామన్న, ఎమ్మెల్యే అనిల్ జాదవ్

రాముడిని మొక్కుదాం.. బీజేపీని తొక్కుదాం

- కష్టపడి పనిచేస్తే బీఆర్ఎస్‌దే విజయం
- మాజీ మంత్రి జోగు రామన్న
- రుయ్యాడిలో కార్యకర్తలతో సమావేశం
- కారు పార్టీని గెలిపించి కేసీఆర్‌కు కానుకగా ఇద్దాం : బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్
- సమస్యలపై పోరాటం చేస్తా : ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు

తాంసి(తలమడుగు), ఏప్రిల్ 12 : 'రాముడిని మొక్కుదాం.. బీజేపీని తొక్కుదాం' నినాదంతో ముందుకెళ్దామని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. శుక్రవారం తలమడుగు మండలం రుయ్యాడి గ్రామంలో నిర్వహించిన మూడు మండలాల కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ గ్రామ స్థాయిలో బీఆర్ఎస్ కమిటీలు కష్టపడి పని చేస్తే రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపు మనదేనన్నారు. కాంగ్రెస్ పార్టీని గెలిపించి తప్పు చేశామని రైతులు బాధపడుతున్నారని తెలిపారు. అధికారంలోకి రాగానే రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు ఆ ఊసే ఎత్తడం లేదన్నారు. కల్యాణ లక్ష్మి పథకంలో తులం బంగారం ఇస్తామని మాట తప్పారని మండిపడ్డారు. కాంగ్రెస్, బీజేపీ నాయకుల కల్లబొల్లి మాటలు నమ్మవద్దని ప్రజలకు సూచించారు. ప్రధాని నరేంద్ర మోదీ యేటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి నిరుద్యోగులను మోసం చేశారని గుర్తు చేశారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు ఓట్లు అడిగే హక్కు లేదన్నారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ ఆత్రం సక్కును భారీ మెజార్టీతో గెలిపించి కేసీఆర్ సార్‌కు కానుకగా ఇద్దామన్నారు. 16న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదిలాబాద్ పర్యటనకు వస్తున్నారని, కార్యకర్తలు సకాలంలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సమస్యలపై పోరాటం చేస్తా ..

ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు

ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోని సమస్యలపై పోరాటం చేస్తానని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు పేర్కొన్నారు. అధినేత కేసీఆర్ ఆశీర్వదించి ఎంపీ అభ్యర్థిగా ఇక్కడికి పంపించారని, తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. బీఆర్ఎస్ శ్రేణులు ఇంటింటికీ విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుల శ్రీనివాస్, జిల్లా నాయకులు కేదారేశ్వర్ రెడ్డి, ఓయూ జేఏసీ నాయకులు ఎల్చల దత్తు, రవి కాంత్ యాదవ్, వైస్ ఎంపీపీ ముచ్చ రేఖ రఘు, అభిరాం రెడ్డి, సుదర్శన్ రెడ్డి, రత్న ప్రకాశ్, బీఆర్ఎస్ పార్టీ తొమ్మిది మండలాల కన్వీనర్లు, జడ్పీటీసీ సుధాకర్, ఎంపీటీసీలు, మహేందర్, కిరణ్, వడూర్ సంజీవ్ రెడ్డి, తాంసి, తలమడుగు, భీంపూర్ మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పాతాళానికి గంగమ్మ

ప్రాజెక్టుల నిర్వహణలో కాంగ్రెస్ సర్కారు వైఫల్యం

- డెడ్ స్టోరేజీకి ఉమ్మడి జిల్లాలోని జలాశయాలు
- శరవేగంగా పడిపోయిన భూగర్భ జలాలు
- గతేడాదితో పోలిస్తే భారీ వ్యత్యాసం
- సాగు, తాగు నీటికి తండ్లాడుతన్న ప్రజానీకం
- ఎండల తీవ్రత పెరిగితే సమస్య మరింత జటిలం

మంచిర్యాల, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టుల నిర్వహణలో వైఫల్యం చెందగా, భూగర్భ జలాలు అడుగంటి తాగు, సాగు నీటికి తండ్లాడాల్సి వస్తున్నది. కాళేశ్వరం కిందున్న ప్రాజెక్టులు నింపకపోవడంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అన్ని జలాశయాలు డెడ్‌స్టోరేజీకి చేరుకున్నాయి. ప్రాజెక్టుల నుంచి నీరు రాక.. కాల్వలు, చెక్ డ్యామ్‌లు నిండక బోర్ల వినియోగం విపరీతంగా పెరిగి గంగమ్మ తల్లి పాతాళానికి చేరుకున్నది. గతేడాది మార్చితో పోలిస్తే ఈ ఏడాది మార్చిలో భూగర్భ జలాల నీటిమట్టం భారీగా పడిపోయింది. అత్యధికంగా నిర్మల్ జిల్లాలో దాదాపు 1.25 మీటర్ల లోతుకు భూగర్భ జలాలు పడిపోయాయి. మంచిర్యాలలో 0.96, ఆసిఫాబాద్‌లో 0.56, ఆదిలాబాద్‌లో 0.19 మీటర్ల లోపలికి వెళ్లిపోయాయి.

ఆదిలాబాద్ రూరల్ మండలం దార్‌లొద్ది గ్రామంలో బోర్ నుంచి నీటిని తెచ్చుకుంటున్న గ్రామస్తులు

మాన్కాపూర్‌లో బావిలో అడుగంటిన నీరు

ప్రాజెక్టుల్లో నీరు లేకే ఈ దుస్థితి..

భూగర్భ జలాలు పడిపోవడానికి ప్రధాన కారణం ప్రాజెక్టుల్లో నీరు లేకపోవడమేనని నిపుణులు చెబుతున్నారు. నిర్మల్ జిల్లాలో కడెం ప్రాజెక్టు, మంచిర్యాల జిల్లాను ఆనుకొని ఉన్న ఎల్లంపల్లి, అన్నారం, సుందిళ్ల ప్రాజెక్టుల్లో పూర్తి స్థాయిలో నీళ్లు ఉన్నాయి. దీంతో గతేడాది ఉమ్మడి జిల్లాలో గోదావరి నది నిండుకుండలా ప్రవహించింది. మండువేసవిలోనూ నీటితో కళకళలాడింది. ఫలితంగా ఈ జిల్లాలో భూగర్భ జలాలకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడలేదు. కానీ ఇప్పుడా పరిస్థితి లేదు. అటు కడెం, ఇటు ఎల్లంపల్లి డెడ్ స్టోరేజీకి చేరుకున్నాయి. కడెం కిందున్న ఆయకట్టుకు ఇప్పటికే క్రాప్ హాలిడే ప్రకటించగా, ఎల్లంపల్లిలో డెడ్‌స్టోరేజీలో ఉన్న నీటిని హైదరాబాద్ మెట్రో వాటర్ స్లపయ్‌కి, పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల తాగునీటి అవసరాలకే వినియోగించుకోవాలని ఆదేశాలు వచ్చాయి. ఒకవేళ అంచనాలు తప్పి ఈ ప్రాజెక్టులు అడుగంటితే బోర్లమీద ఆధారపడి తాగునీరు సరఫరా చేయాల్సి వస్తుంది. గతేడాది ప్రాజెక్టుల్లో పుష్కలమైన నీరు ఉండడంతో బోర్లలో భూగర్భ జలాలు ఉబికివచ్చాయి. కానీ ఈ ఏడాది ప్రాజెక్టుల్లో నీరులేక భూగర్భ జలాలు రోజురోజుకూ పడిపోతూవస్తున్నాయి.

మండలాల్లో పాతాళానికి..

జిల్లా మొత్తానికి సగటున చూసినప్పుడు భూగర్భ జలాలు పడిపోయిన శాతం తక్కువగా ఉన్నా.. చాలా మండలాల్లో ఆందోళనకరమైన దుస్థితికి జలమట్టం పడిపోయింది. ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలో గతేడాది ఈ సమయానికి 25.10మీటర్ల లోతులో భూగర్భ జలాలు అందుబాటులో ఉండగా, ఈ ఏడాది 32.00మీటర్లలోతుకు అవి పడిపోయాయి. ఆదిలాబాద్ రూరల్ మండలం యాపల్‌గూడ ప్రాంతంలో 7.60మీటర్ల నుంచి 9.55మీటర్లకు పడిపోయాయి. నిర్మల్ జిల్లాలో మామడ మండలంలోని కొన్ని ప్రాంతాల్లో గతేడాది 18.64 మీటర్లలోతులో ఉన్న జలాలు 36.62మీటర్లకు పడిపోయాయి. లోకేశ్వరంలో 10.53 మీటర్ల నుంచి 16.15 మీటర్ల లోపలికి వెళ్లిపోయాయి. తానూర్, పెంబి, ముథోల్ సహా మిగిలిన మండలాల్లో రెండు మీటర్ల నుంచి ఐదు మీటర్ల వరకు భూగర్భ జలమట్టం పడిపోయింది. మంచిర్యాల జిల్లా నస్పూర్ ప్రాంతం లో 3.31 మీటర్ల నుంచి 9.80 మీటర్లకు, జన్నారంలో 2.67నుంచి 4.60, జైపూర్‌లో 16.29మీటర్ల నుంచి 21.10మీటర్లకు భూగర్భజలాలు పడిపోయాయి. ఇక ఆసిఫాబాద్ జిల్లాలో రెబ్బెన మండలంలోని కొన్ని ప్రాంతాల్లో 6.70మీటర్ల నుంచి 9.72 మీటర్లకు, కాగజ్‌నగర్‌లో 14 మీటర్ల నుంచి 16.20మీటర్లకు భూగర్భ జలమట్టం తగ్గింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇలాంటి పరిస్థితులే ఉన్నట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. కాగా, ఇప్పటికే భూగర్భ జలాలు అడుగంటి సాగు, తాగునీటికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండగా, ఎండల తీవ్రత పెరిగితే మరింత సమస్య జటిలమవుతుందన్న ఆందోళన వ్యక్తమవుతున్నది.

గతేడాది, ఈ ఏడాది మార్చి నెలల్లో భూగర్భ జలాలు(సగటున)

జిల్లా	మార్చి-2023	మార్చి-2024	పడిపోయిన నీటిమట్టం
నిర్మల్	8.94	10.19	-1.25
మంచిర్యాల	6.08	7.04	-0.96
ఆసిఫాబాద్	7.82	8.38	-0.56
ఆదిలాబాద్	8.92	9.11	-0.19

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

హాజరైన బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తలు

గులాబీ దళం.. గెలుపే ధ్యేయం

పార్లమెంట్ ఎన్నికల్లో విజయం కోసం పకడ్బందీ ప్రణాళికలు

- నేటి నుంచి ఇంటింటా ప్రచారానికి శ్రీకారం
- కేసీఆర్ సర్కారు చేపట్టిన సంక్షేమం, ప్రగతిపై ప్రజలకు అవగాహన
- బీజేపీ, కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టేందుకు సన్నద్ధం
- 16న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాక

ఆదిలాబాద్, ఏప్రిల్ 12 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా.. గులాబీ దళం ముందుకెళ్తున్నది. ఆదిలాబాద్ ఎంపీ అభ్యర్థిగా ఆత్రం సక్కును ప్రకటించిగా, ప్రతిష్టాత్మకంగా తీసుకున్న గులాబీ సేన పకడ్బందీ ప్రణాళికలతో దూసుకెళ్తున్నది. ఇప్పటికే పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో విస్తృతంగా ప్రచారం చేస్తుండగా, నేటి నుంచి ఇంటింటికీ గులాబీ దళం కార్యక్రమానికి శ్రీకారం చుట్టుబోతున్నది. బీఆర్ఎస్ మండలస్థాయి కమిటీలు ఏర్పాటు చేసుకొని, గ్రామస్థాయి నాయకులతో కలిసి ఓటర్లను కలిసేందుకు నెల రోజుల ప్రణాళికలు రూపొందించారు. ప్రచార రథాలను సైతం సిద్ధం చేశారు. ఏ రోజు ఎక్కడ ప్రచారం నిర్వహించాలని నిర్ణయించుకొని, ముందస్తుగా గ్రామస్థాయి నాయకులకు సమాచారం అందిస్తారు. మండల, గ్రామస్థాయి నాయకులు సమన్వయంతో ఇంటింటా తిరుగుతూ ఓట్లు అభ్యర్థిస్తారు. ఎండలు మండుతుండడం, పెళ్లిళ్ల సీజన్ కావడంతో ఉదయం 6 గంటల నుంచే ప్రచారం చేయాలని నిర్ణయించారు. బీఆర్ఎస్ సర్కారులో అమలు చేసిన పథకాలు, సాధించిన ప్రగతిని ప్రజలకు వివరించనున్నారు. కేంద్రంలోని బీజేపీ పాలనలో జిల్లాకు జరిగిన అన్యాయం, రాష్ట్రంలో నాలుగు నెలల కాంగ్రెస్ పాలనలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రజలకు తెలియజేసేందుకు సన్నద్ధమయ్యారు.

16న కేటీఆర్ పర్యటన

పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ 16న జిల్లాలో పర్యటించనున్నారు. ఆదిలాబాద్‌లోని ఓ ప్రైవేట్ గార్డెన్‌లో పార్లమెంట్ పరిధిలోని పోలింగ్ బూత్ స్థాయి నాయకులతో నిర్వహించే సమావేశంలో ఆయన పాల్గొంటారు. కేటీఆర్ పర్యటనకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న తెలిపారు. పార్లమెంట్ పరిధిలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 2111 పోలింగ్ బూత్‌లుండగా, ప్రతి పోలింగ్ స్టేషన్ నుంచి ఇద్దరు సమావేశానికి హాజరవుతారని ఆయన తెలిపారు.

సమష్టి కృషితో విజయం సాధిస్తాం

- మాజీ మంత్రి జోగు రామన్న

జిల్లా, మండల, గ్రామస్థాయి నాయకుల సమష్టి కృషితో విజయం సాధిస్తామని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ బీఆర్ఎస్ కార్యాలయంలో ఆదిలాబాద్ నియోజకవర్గంలోని జైనథ్, బేల, మావల, ఆదిలాబాద్ రూరల్ మండలాల ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు నెల రోజులు ఉండడంతో నేటి నుంచి ఇంటింటా ప్రచారం నిర్వహించాలని సూచించారు. మండల, గ్రామస్థాయి నాయకులు కలిసికట్టుగా ప్రచారం చేయాలన్నారు. కేంద్రంలో పదేళ్లు అధికారంలో ఉన్న బీజేపీ చేసిందేమీ లేదని, ఆర్మూర్, ఆదిలాబాద్ రైల్వేలైన్, విమానాశ్రయం ఏర్పాటు, సిమెంటు పరిశ్రమ పునఃప్రారంభంవంటి వాటిని మోదీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఇటీవల జిల్లాలో పర్యటించిన ప్రధాన మోదీ పెండిగ్ ప్రాజెక్టుల గురించి కనీసం మాట్లాడలేదని, ఈ విషయం ప్రజల్లో చర్చనీయాంశంగా మారిందన్నారు. రాముని పేరిట బీజేపీ ఓట్లను దండుకునే ప్రయత్నం చేస్తున్నదని తెలిపారు. రాష్ట్రంలో నాలుగేళ్ల కాంగ్రెస్ పాలన అస్తవ్యస్తంగా మారిందని, ఆరు గ్యారెంటీలు అటకెక్కాయని, 420 హామీలను కాంగ్రెస్ నాయకులు మరిచిపోయారని తెలిపారు. రాహుల్‌గాంధీ కొత్తగా మేనిఫెస్టో విడుదల చేయడం హాస్యాస్పదమన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన రూ.2 లక్షల రుణమాఫీ, ఎకరాకు రూ.15 వేల సాయం, పంటలకు బోనస్ లాంటి పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. గృహజ్యోతి పథకం, రూ.500 సిలిండర్ నామ్‌కే వాస్తేగా అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు రోకండ్ల రమేశ్, రవుత్ మనోహర్, మార్సెట్టి గోవర్ధన్, జోగు మహేందర్, యాసం నర్సింగ్ రావు, లింగారెడ్డి, సతీశ్‌పవార్, గంభీర్ ఠాక్రే, నల్ల రాజేశ్వర్ పాల్గొన్నారు.

పెంబిలో పూజలు చేస్తున్న బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్

వైభవంగా హరిహర ఆలయ బ్రహ్మోత్సవాలు

ప్రత్యేక పూజలు చేసిన జాన్సన్ నాయక్

పెంబి, ఏప్రిల్ 12: మండల కేంద్రంలో హరిహర ఆలయ వార్షికోత్సవం సందర్భంగా బ్రహ్మోత్సవాలు రెండవ రోజు వైభవంగా కొనసాగాయి. యజ్ఞాచార్యులు చక్రపాణి నరసింహమూర్తి ఆధ్వర్యంలో స్థాపిత దేవతారాధన, 108 మంది దంపతులతో కలశ పూజ, కుంకుమార్చన నిర్వహించారు. బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ భూక్యా జాన్సన్ నాయక్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనను శాలువాతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హరిహర ఆలయ కమిటీ అధ్యక్షుడు సల్లా రామేశ్వర్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సల్లా నరేందర్ రెడ్డి, మాజీ సర్పంచ్ పూర్ణచందర్ గౌడ్, నాయకులు పుప్పాల శంకర్, నర్సయ్య, రాజలింగు, గన్నారపు సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

బెంబర్ శివారులో చిరుత కలకలం..

తానూర్, ఏప్రిల్, 12 : మండలంలోని బెంబర్ గ్రామ శివారులో చిరుతపులి సంచారం కలకలం రేపింది. గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. లచ్చన్నకు చెందిన పొలం వద్ద గురువారం లేగదూడపై చిరుత దాడి చేసి చెట్టుపైకి తీసుకెళ్లి హతమార్చింది. గ్రామస్తులు అటవీ అధికారులకు సమాచారం అందించారు. శుక్రవారం బీట్ ఆఫీసర్ మహేశ్వర్ సంఘటన స్థలానికి చేరుకొని పాదముద్రలు చూడగా కనిపించలేదన్నారు. వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లే రైతులు జాగ్రత్తగా వెళ్లాలని సూచించారు. చిరుత సంచారంతో గ్రామస్తులు పొలాలకు వెళ్లేందుకు భయపడుతున్నారు.

మావోయిస్టులపై సమాచారం అందించండి

ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్.జీవన్ రెడ్డి

ఎదులాపురం, ఏప్రిల్ 12 : మావోయిస్టుల సమాచారం ఇస్తే బహుమతి అందజేస్తామని ఆదిలాబాద్ డీఎస్పీ ఎల్ జీవన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం మావోయిస్టులపై ప్రకటించిన రివార్డులు ఉన్న వివరాలతో కూడిన ఫ్లెక్సీలను జిల్లా ఎస్పీ గౌస్ ఆలం ఆదేశాల మేరకు విడుదల చేశారు. జిల్లాలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలు, రైల్వే, బస్ స్టేషన్లలో 'సమాచారం మాకు– బహుమతి మీకు' అనే శీర్షికతో ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. పోలీసులకు సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచి, రివార్డులు అందజేస్తామని తెలిపారు.

రేపటి వరకే ఓటరు నమోదు

-ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

ఎదులాపురం, ఏప్రిల్ 12 : ఈ నెల 14వ తేదీతో ఓటరుగా నమోదుకు గడువు ముగుస్తుందని, 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 1 వ తేదీ వరకు 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఓటరు నమోదు కోసం ఫారం నంబర్ 6 నింపి సంబంధిత బూత్ లెవెల్ అధికారులకు అందించాలని సూచించారు. మొబైల్ యాప్‌లో ఆధార్ కార్డు, ఎస్సెస్సీ మార్కుల మెమో ఆధారంగా నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఓటరుగా నమోదైన ప్రతి ఒక్కరూ వచ్చే నెల 13న పార్లమెంట్ ఎన్నికల్లో బాధ్యతగా నిజాయితీగా నిర్భయంగా ఓటు వేసి పోలింగ్ శాతాన్ని పెంచాలని కోరారు. ఇప్పటికే ఓటరుగా నమోదైన వారు జాబితాలో పేర్లను సరి చూసుకోవాలని సూచించారు.

బండెనక బండి కట్టి..

ఎడ్లబండ్లపై కుటుంబ సమేతంగా ఇంద్రాదేవి ఆలయానికి వస్తున్న ఆదివాసులు

ఇంద్రవెల్లి, ఏప్రిల్12 : ఇంద్రవెల్లి మండలకేంద్రంలోని ఇంద్రాదేవి ఆలయంలో వాల్గొండ గ్రామానికి చెందిన ఆదివాసీలు చైత్రమాసం సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాల ప్రకారం ఎడ్లబండ్లతో కుటుంబ సమేతంగా తరలివచ్చారు. ఆలయ ఆవరణలో వంటలు వండి నైవేద్యాలను సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కనక జుగాదిరావ్, మాన్కుపటేల్, కనక లచ్చుపటేల్, శంభు దేవారి పాల్గొన్నారు.

బెల్ట్‌షాపులు, కల్లు బట్టీలపై మహిళల కన్నెర్ర..

- మద్యం, కల్లు బాటిళ్ల ధ్వంసం

తాంసి(తలమడుగు), ఏప్రిల్ 12 : ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలంలో పల్సి(బీ), కోసాయి గ్రామాల్లో బెల్ట్ షాపులు, కల్లు బట్టీలపై మహిళలు దాడి చేశారు. అక్రమంగా విక్రయిస్తున్న మద్యం, దేశీదారు, కల్తీ కల్లు బాటిళ్లను ధ్వంసం చేసి కన్నెర్రజేశారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ ఇప్పటికే నీళ్లు లేక పంటలన్నీ ఎండిపోయి పెట్టుబడికి తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలి అని సతమవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితిలో గ్రామాల్లోని యువకులు, రైతులు మద్యానికి బానిసై కుటుంబాలను వీధిన పడేస్తున్నారని వాపోయారు. విచ్చల విడిగా బెల్ట్‌షాపులను నిర్వహించడంతో ఈ పరిస్థితి వచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మళ్లీ బెల్ట్‌షాపులు నిర్వహిస్తే ఇళ్లపై సైతం దాడులు చేస్తామంటూ నిర్వాహకులను హెచ్చరించారు. ఇప్పటికైనా ఎక్సైజ్ శాఖ అధికారులు స్పందించి బెల్ట్ షాపులను మూసివేయాలని డిమాండ్ చేశారు. ఆందోళన చేపట్టిన ఆదివాసీ మహిళలను పలు ప్రజా సంఘాల నాయకులు అభినందించారు.

కల్లు బాటిళ్లను పారబోస్తున్న మహిళలు